విశాఖపట్టణం
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 34 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## సునీల్ నాయక్ చుక్కెదురు

నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

బిహార్‌లో అరెస్ట్ చేసేందుకు యత్నాలు



2



## మహాకుంభ మేళా తరహాలో పుష్కరాలు

### 8 నుంచి 10 కోట్ల మంది వచ్చే అవకాశం

2027 జూన్ 26 నుంచి జులై 7వ వరకు నిర్వహణ

ఆరు జిల్లాల పరిధిలో విస్తృత ఏర్పాట్లు

శాఖల మధ్య సమన్వయానికి నోడల్ ఆఫీసర్లు

పుష్కరాల సబ్ కమిటీ భేటీలో కీలక నిర్ణయాలు

(అమరావతి - జయజయహే)

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027 గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయం 5వ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, ..మిగతా 2లో

# నల్లమలతో తెలుగు రాష్ట్రాలకు మేలు


వృధా జలాలను వినియోగించేలా ప్లాన్

సాగు, తాగునీటి అవసరాలకు వాడకం

భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

పోలవరం-నల్లమల లింక్‌పై కీలక వివరణ



(అమరావతి - జయజయహే)

రాష్ట్ర భవిష్యత్తు నీటి లభ్యతపైనే ఆధారపడి ఉందని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను జల సమృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గోదావరి నుంచి ఏటా 3 వేల టీఎంసీల వరద జలాలు సముద్రం పాలవుతున్నాయని, ఈ వృధాను అరికట్టి రాష్ట్రవ్యాప్తంగా సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించేలా భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. వంశధార నుండి పెన్నా వరకు రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాదాస్పదం అవుతున్న పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై ఆయన కీలక వివరణ ఇచ్చారు. వృధాగా పోయే నీటినే తాము వాడుకుంటున్నామని, దీనివల్ల పొరుగు రాష్ట్రాలకు ఎటువంటి నష్టం లేదని, పైగా రెండు తెలుగు రాష్ట్రాలకు ..మిగతా 2లో

## సోము వీర్రాజుపై వైసీపీ దూకుడు



మైక్ తీసుకున్నారని దాడికి యత్నం

మండలిలో మాటల యుద్ధం

రాయలసీమ లిఫ్ట్‌పై చర్చలో ఘటన

(అమరావతి - జయజయహే)

శాసనమండలిలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై మండలి దద్దరిల్లింది. ఈ ఇరిగేషన్ ప్రాజెక్టుపై చర్చ నేపథ్యంలో వైఎస్సార్సీపీ సభ్యులు రచ్చ చేశారు. నేతల మధ్య మాటల యుద్దానికి దారి తీసింది. పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలి అట్టుడికింది. ఈ క్రమంలో వైఎస్సార్సీపీ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజుపైకి దూసుకెళ్లారు. సోము వీర్రాజు మీదకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో పాటు ఇతర వైఎస్సార్సీపీ సభ్యులు వెళ్లారు. రాయలసీమ లిఫ్ట్‌పై మంత్రి రామానాయుడు సమాధానం పూర్తయినా వైఎస్సార్సీపీ సభ్యులు చర్చకు పట్టుబట్టారు. సమాధానం పూర్తైనందున తర్వాతి ప్రశ్నకు ఛైర్మన్ మోషేన్ రాజు అవకాశం కల్పించారు. ఛైర్మన్ అవకాశం కల్పించటంతో తర్వాతి ప్రశ్న బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు లేవనెత్తారు. ఛైర్మన్ తీరుకు నిరసనగా వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సోము వీర్రాజు మీదకు వెళ్లారు. తాము నిరసన తెలువుతుంటే మైక్ ఎందుకు తీసుకున్నావ్ అంటూ సోము వీర్రాజు మీద దాడికి యత్నించారు. ఇతర ..మిగతా 2లో





## ఒకరికి చేతి కట్టు... మరొకరికి కర్రసాయం

గాయపడిన ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య క్రీడా పోటీల్లో గాయాలు

అసెంబ్లీ ఆవరణలో ఆసక్తికర సంభాషణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఆవరణలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. చేతికి కట్టుతో ఎమ్మెల్సీ శ్రీకాంత్, కాలుకు దెబ్బ తగిలి కర్ర సాయంతో ఎమ్మెల్యే పార్థసారథి గురువారం ఒకే సమయంలో కారులో అసెంబ్లీ ఆవరణకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న ఎమ్మెల్యే బొండా ఉమా .. వారిని ..మిగతా 2లో

## ఇజ్రాయెల్ భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

మైత్రి మరింత బలపడిందన్న మోదీ, నెతన్యాహు

భారత్-ఇజ్రాయెల్ బంధం 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి

ఏఐ, క్వాంటం టెక్నాలజీపై కొత్త ఒప్పందం..

ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు

ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడతామని ఇరు దేశాల స్పష్టీకరణ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ..మిగతా 2లో




## గ్రేటర్ మేయర్ రేస్..!

పదవీ కాలం ముగుస్తుండటంతో పోటాపోటీ

సామాజిక వర్గాల వారీ నేతల్లో ఆశలు

అసలు ఎన్నికలు జరుగుతాయో లేదో డౌటే..

(విశాఖపట్నం - జయజయహే)

అప్పుడెప్పుడో ఐదేళ్ల పాటు గ్రేటర్ విశాఖ పీఠాన్ని శాసించింది టీడీపీ. మరోసారి ఫుల్ టర్మ్ వైజాగ్ నగరాన్ని పాలించాలనేది తెలుగు తమ్ముళ్ల కల. దాంతో మొన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచే గ్రేటర్ విశాఖ మేయర్ పీఠంపై కన్నేసింది కూటమి. వైసీపీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టి నాలుగు దశాబ్దాల కలను నెరవేర్చుకుంది టీడీపీ. కొత్త మేయర్ పదవీకాలం మార్చితో ముగియనుంది. దీంతో ఇప్పటినుంచే వైజాగ్ మేయర్ పీఠం కోసం రేసుగుర్రాల్లాగా పరిగెడుతున్నారు లీడర్లు. అయితే విశాఖ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో ఇప్పటికైతే పూర్తి క్లారిటీ లేదు. భీమిలీ, గాజువాక, అనకాపల్లి ..మిగతా 2లో

## అవినాశ్ లొంగుబాటు

సుప్రీం ఆదేశాలతో చిక్కిన ఏ7

లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గత ఏడాది కాలంగా పోలీసులకు దొరకకుండా తప్పించుకొని తిరుగుతున్న ఏడో నిందితుడు ముప్పిడి అవినాష్ రెడ్డి, ఎట్టకేలకు మంగళవారం విజయవాడలోని సిట్ అధికారుల ఎదుట లొంగిపోయారు. సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ఆయన చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఇక లొంగిపోవడం తప్ప మరో మార్గం లేక ఆయన తన న్యాయవాదితో కలిసి అధికారుల ..మిగతా 2లో



# మహాకుంభ మేళా తరహాలో పుష్కరాలు

**మొదటి పేజీ తరువాయి...**

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో(తొలి, వీకెండ్, అమావాస్య) దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ ప్రక్రియ, రోడ్లు, వాటర్ తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే




టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

## సోము వీర్రాజుపై వైసీపీ దూకుడు

**మొదటి పేజీ తరువాయి...**



వైఎస్సార్సీపీ సభ్యులు ఇజ్రాయిల్‌ను అనుసరించారు. మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ సోము వీర్రాజుకు మద్దతు వెళ్లి అడ్డుకున్నారు. ఉద్రిక్తత వాతావరణం మధ్య ఛైర్మన్ మోషేన్ రాజు సభను వాయిదా వేశారు. సమయం వృథా చేయొద్దంటే దాడి చేస్తారా: అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ సభ్యుల ప్రశ్నకు 20 నిమిషాలు సమయం ఇచ్చిన ఛైర్మన్ మంత్రి సమాధానానికి 7 నిమిషాల కేటాయించారని సోము వీర్రాజు ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదని ఛైర్మన్‌ను కోరే సమయంలో ఇజ్రాయిల్ తనపై దాడికి యత్నించారని తెలిపారు. విలువైన సభా సమయం వృథా చేయొద్దు అని కోరితే దాడికి యత్నం తగునా అని ప్రశ్నించారు. వెంటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వైఎస్సార్సీపీ సభ్యుల ప్రవర్తన ఉందని మండిపడ్డారు. 319 రూపాయలకి కొనుగోలు చేసేది కల్తీ నెయ్యి కాక మరేంటని నిలదీశారు. దేవుడితో డ్రామాలు ఇకనైనా ఆపాలని సోమువీర్రాజు హితవు పలికారు.

"ప్రశ్నోత్తరాలు జరిపించాలని నేను ఛైర్మన్‌ను అడుగుతుంటే ఒక్కసారిగా దాడికి వచ్చారు. హక్కు ఉందని పదేపదే సభను వాయిదా వేస్తారా. ప్రతిపక్షం మాట్లాడేందుకు అవకాశమిచ్చినప్పుడు ప్రభుత్వానికి ఇవ్వనక్కర్లేదా? విలువైన సభా సమయం వృథా చేయొద్దు అని కోరితే దాడికి యత్నం తగునా." అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేసారు. ముందు ప్రశ్నోత్తరాలు ప్రారంభం కాగానే పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్‌పై వైఎస్సార్సీపీ సభ్యులు ప్రశ్నలు సంధించారు. రాయలసీమ లిఫ్ట్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీల లబ్ధి కోసం చేసినవేనని మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు. రాయలసీమ లిఫ్ట్‌పై మాట్లాడే నైతిక హక్కు వైఎస్సార్సీపీ సభ్యులకు లేదని మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనలతో సభ పలుమార్లు వాయిదా పడింది.

రాయలసీమ లిఫ్ట్‌పై శాసనమండలిలో వాడీ వేడీ చర్చ జరగ్గా మంత్రి నిమ్మల రామానాయుడు వైఎస్సార్సీపీ సభ్యుల ఆరోపణలకు దీటైన సమాధానాలు ఇచ్చారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును 2020 మే 20న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపిందని మంత్రి స్పష్టం చేశారు. 2020లో సీఎంగా చంద్రబాబు ఉన్నారా జగన్ ఉన్నారా అని ప్రశ్నించారు. 5 ఏళ్ల వైఎస్సార్సీపీ పాలనలో రాయలసీమ లిఫ్ట్‌ను కనీసం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్‌ను నిలిపివేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని అన్నారు. ఈ విషయం గురించి వైఎస్సార్సీపీ సభ్యులు జగన్‌ను ఎందుకు నిలదీయలేదని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. మంత్రి నిమ్మల సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసిన వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. రాయలసీమ లిఫ్ట్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రేవంత్ ప్రకటనపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టి ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. రాయలసీమ లిఫ్ట్‌పై సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీష్‌రావు వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని బొత్స సత్యనారాయణను నిమ్మల నిలదీశారు. ఆ సమయంలో కొంత వాగ్వాదం జరిగింది.

## నల్లమలతో తెలుగు రాష్ట్రాలకు మేలు

**మొదటి పేజీ తరువాయి...**

లాభమే కలుగుతుందని ఉద్ఘాటించారు. గంగా-కావేరీ అనుసంధానం తన చిరకాల స్వప్నమని, ఆ దిశగా అడుగులు పడాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. గత ఐదేళ్లలో సాగునీటి రంగం తీవ్ర విధ్వంసానికి గురైందని ముఖ్యమంత్రి మండిపడ్డారు. పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడం మానవ తప్పిదమేనని, వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు చేశారని విమర్శించారు. అయితే, ఆ వైఫల్యాలను సరిదిద్ది, వచ్చే ఏడాది జూలై నాటికి వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల కోసం రూ. 2 వేల కోట్లు కేటాయించి, దశలవారీగా పనులు పూర్తి చేస్తామని, చింతలపూడి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి ఏలూరు, కృష్ణా జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. సాంకేతికతను జోడించి భూగర్భ జలాలను పెంపొందించడంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులోనే నీరు లభ్యమవుతోందని, దీనివల్ల విద్యుత్ వినియోగం తగ్గి రూ. 91 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడించారు. నీటి నిర్వహణ బాధ్యతలను మళ్ళీ నీటి వినియోగదారుల సంఘాలకే అప్పగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ఒక పక్కా బ్లూ ప్రింట్‌తో ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

## అవినాశ్ లొంగుబాటు

**మొదటి పేజీ తరువాయి...**

ముందుకు వచ్చారు. లిక్కర్ స్కామ్ కేసు నమోదైనప్పటికీ నుంచి ముప్పిడి అవినాష్ రెడ్డి పరారీలో ఉన్నారు. ఈ కేసులో ఆయన సోదరుడు అరెస్ట్‌అయిన తర్వాత తనను కూడా పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ఆయన దేశం విడిచి పారిపోయారు. గతేడాది నుంచి ఆయన ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఈ క్రమంలోనే ఆయనపై అధికారులు లుక్ అవుట్ సర్క్యులర్ కూడా జారీ చేశారు. తొలుత బెయిల్ కోసం అవినాష్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే జనవరి 29న హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టులో చుక్కెదురు కావడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించి, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ముప్పిడి అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యాకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టులో ఆసక్తికరమైన చర్చ జరిగింది. అవినాష్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆయన ఫిబ్రవరి 26న శ్రీలంక నుంచి రావడానికి సిద్ధంగా ఉన్నారని, అప్పటి వరకు అరెస్టు చేయకుండా లుక్ అవుట్ సర్క్యూలర్‌ను నిలిపివేయాలని కోరారు. అయితే దీనిపై సీజేఐ సూర్యాకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా నిందితుడు పరారీలోనే ఉన్నాడు కదా? అసలు ఏ కోర్టు అనుమతి తీసుకొని ఆయన విదేశాలకు వెళ్లారు? అని సూటిగా ప్రశ్నించింది. చట్టాన్ని ఏమార్చేందుకు ప్రయత్నించే వ్యక్తులకు ముందస్తు బెయిల్ ఇచ్చి రక్షణ కల్పించాల్సిన అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది ముందు ఆయన లొంగిపోవాలి, ఆ తర్వాతే రెగ్యులర్‌బెయిల్ లేదా మధ్యంతర బెయిల్ పిటిషన్లు పరిశీలిస్తామని చెప్పారు. దీంతో అవినాష్ రెడ్డికి సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇక తప్పించుకునే అవకాశం లేదని గ్రహించిన ముప్పిడి అవినాష్ మంగళవారం సాయంత్రమే విజయవాడలోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. తన న్యాయవాదితో కలిసి వచ్చి అధికారుల ఎదుట సరెండ్ అయ్యారు. ఏడాది కాలంగా సాగుతున్న ఈ దాగుడుమూతల పర్వానికి ఇక్కడితో తెరపడింది. మొత్తానికి లిక్కర్ స్కామ్ కేసులో అవినాష్ రెడ్డి లొంగుబాటుతో ఈ దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం కనిపిస్తోంది.

## ఇజ్రాయెల్ భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

**మొదటి పేజీ తరువాయి...**

ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని 'శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు. అంతకుముందు ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు.

వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో, వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇస్తామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటు లేదని మోదీ స్పష్టం చేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**మోదీ పర్యటన చిన్నదే అయినా అద్భుతం: నెతన్యాహు ప్రశంసలు**

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో ఇరు నేతల మధ్య చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."ఇది ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసింది" అని నెతన్యాహు ప్రశంసించారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. "ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించదగిన ప్రాచీన నాగరికతలు. భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలం" అని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.





## ఒకరికి చేతి కట్లు... మరొకరికి కర్రసాయం

**మొదటి పేజీ తరువాయి...**

ఉద్దేశించి సరదా వ్యాఖ్యలు చేశారు. క్రీడల్లో దెబ్బతగిలిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వికలాంగుల కోటాలో ఫించన్ ఇవ్వమని సీఎం చంద్రబాబు నాయుడు ముందు ప్రతిపాదన పెడదామని బోండా ఉమాసరదా వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. చట్టసభ సభ్యులు కాబట్టి అవసరమైతే అత్యవసర బిల్లు పెట్టిద్దాం అంటూ చమత్కారం చేశాడు. దీంతో తోటి సభ్యులు స్పందిస్తూ.. నిజంగా అలాంటి బిల్లు పెడితే సగం మందికి పథకం వర్తించేలా ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. ఆటవిడుపు కోసం ఆటలాడమంటే ప్రతీ ఒక్కరూ కుర్రాళ్లలా ఫీలయి ఇలా దెబ్బలు తగిలించుకుంటున్నాం అంటూ శ్రీకాంత్ బదులిచ్చారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో చాలా మంది ఎమ్మెల్యేలు ప్రొఫెషనల్‌గా ఆడుతూ ప్రతిభ చాటారు. ఈ క్రమంలో పలువురు గాయాలపాలయ్యారు. బుధవారం క్రికెట్ ఆడిన ఉప సభాప్రతి రఘురామకృష్ణరాజు రనౌట్ నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడడంతో అతని చేతికి స్వల్ప గాయమైంది. వెంటనే ఫిజియో వైద్యుడు పరీక్షించి పట్టీ వేశారు. అదేవిధంగా ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎమ్మెల్సీ కుంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే పార్థసారథికి గాయాలయ్యాయి. తమ జట్టుపై కూతుకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పట్టుకునే ప్రయత్నంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వారిపై పడ్డారు. ఈ క్రమంలో పార్థసారథి పాదం భాగంలో గాయమైంది. శ్రీకాంత్‌కు భుజం వద్ద కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యాయి. వీరి గాయాలను బుధవారం పరీక్షలో గుర్తించారు. అయితే, గురువారం ఉదయం అసెంబ్లీకి ఎమ్మెల్సీ శ్రీకాంత్ చేతికి కట్టుతో, పార్థసారథి కాలుకు దెబ్బతగిలి కర్ర సాయంతో వచ్చారు. వీరిద్దరూ ఒకేసారి వేరువేరు వాహనాల్లో అసెంబ్లీ రావడం.. అక్కడే ఎమ్మెల్యే బోండా ఉండటంతో వీరి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది.

## సునీల్ నాయక్ చుక్కెదురు

(అమరావతి - జయజయహే)

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఐపీఎస్ సునీల్ నాయక్‌పై గుంటూరు న్యాయస్థానం నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దీంతో బిహార్‌లో ఐజీగా ఉన్న సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. కొంతకాలంగా విచారణకు హాజరు కాకుండా తప్పించుకుంటున్నారు సునీల్ నాయక్. గుంటూరు కోర్టులో పోలీసులు నిన్న (బుధవారం) నాన్-బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం గుంటూరు కోర్టు ఆయనపై నాన్-బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఐపీఎస్ అధికారులు పి.వి.సునీల్ కుమార్, పి.సీతారామాంజనేయులు, సునీల్ నాయక్ ప్రధాన నిందితులుగా ఉన్నారు.

## గ్రేటర్ మేయర్ రేస్..!

**మొదటి పేజీ తరువాయి...**

మునిసిపాలిటీల విలీనంతో 98 వార్డులతో రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా ఉన్న జీవీఎంసీలో..భీమిలీ, అనకాపల్లిలోని గ్రామీణ మండలాలను కూడా కలుపుతారని ఎప్పటినుంచో టాక్ వినిపిస్తోంది. అవన్నీ జీవీఎంసీలో కలిస్తే మరో 25 వార్డులు పెరిగే అవకాశం ఉంది. జీవీఎంసీని 150 వార్డులకు పెంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా చెబుతున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ మేయర్ పీఠం కోసం కూటమిలో అప్పుడే చర్చ మొదలైంది. విశాఖ తొలి మేయర్ పీఠం బీజేపీ దక్కించుకుంది. 1987లో టీడీపీ గెలిచింది. 1995, 2005, 2007లలో వరసగా మూడుసార్లు కాంగ్రెస్ మేయర్ ఛైర్‌ను శాసించింది. 2021లో జరిగిన ఎన్నికలలో వైసీపీ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. నాలుగేళ్ల పాటు మేయర్‌గా వైసీపీకి చెందిన హరి వెంకటకుమారి కొనసాగారు. గతేడాది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమెను గద్దె దించారు. టీడీపీకి చెందిన శ్రీనివాసరావు మేయర్ అయ్యారు. ఈ ఏడాది మార్చితో జీవీఎంసీ పదవీకాలం పూర్తి కాబోతోంది. ఓటర్ల తుది జాబితా మార్చి 9లోగా తయారు చేసి పంపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. దీంతో రాష్ట్రంలో కీలకమైన నగరంగా ఉన్న విశాఖ జీవీఎంసీ పాలనా పగ్గాలు దక్కించుకోవాలని కూటమి పట్టుదలగా ఉంది. జీవీఎంసీ మేయర్ పీఠం కోసం టీడీపీలో రేసే బానే ఉంది. ప్రస్తుత మేయర్ శ్రీనివాసరావు మరోసారి మేయర్ సీటును ఆశిస్తున్నారు. బలమైన గవర సామాజికవర్గానికి చెందిన ఆయన విశాఖలో తమ సామాజికవర్గం అండదండలతో పీఠాన్ని దక్కించుకోవాలని ప్లాన్ చేస్తున్నారు.

**నేతల్లో ఆశలు...**

విశాఖలో యాదవ సామాజికవర్గం కూడా పెద్ద సంఖ్యలో ఉంది. పైగా అవిశ్వాసం పెట్టి వైసీపీకి చెందిన యాదవ సామాజికవర్గం మహిళను తొలగించారని, టీడీపీలో తమ సామాజికవర్గానికి మేయర్ పదవి కేటాయించాలని కోరుతున్నారు. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు పట్టాభి మేయర్ కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. ఆయన గతంలో జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. అలాగే కాపులు, మత్స్యకారులు, నాగవంశీయుల నుంచి కూడా మేయర్ పీఠానికి తెలుగుదేశంలో పోటీ ఉంది. ఇక కూటమిలో కీలకమైన మిత్రపక్షంగా ఉన్న జనసేన కూడా మేయర్ పీఠాన్ని ఈసారి పంచుకోవాలని చూస్తోంది. గతేడాది అవిశ్వాస తీర్మానం తర్వాత జనసేనకు డిప్యూటీ మేయర్ పదవి ఇస్తారని ప్రచారం జరిగినా అది ఇంప్లిమెంట్ కాలేదు. దాంతో ఈ సారి మేయర్ పీఠానికే జనసేనలోని కీలక నేతలు గురి పెడుతున్నారు. విశాఖ నగరంలో పెద్ద సంఖ్యలో కాపులు ఉన్నారని..మేయర్ పదవిని రెండున్నరేళ్లు పంచుకునేలా ప్రతిపాదనలు పెట్టాలని అనుకుంటున్నారట. బీజేపీకి విశాఖ నగరంలో బలం ఉంది. ఆ పార్టీ కూడా డిప్యూటీ మేయర్ పదవులతో పాటు వీలైతే ఒక ఏడాది మేయర్ సీటు కోరే ఆలోచనలో ఉన్నారట. ఎక్కువ కార్పోరేటర్ సీట్లను తీసుకుని సంఖ్యాబలం పెంచుకోవాలని చూస్తోందట బీజేపీ. ఎన్నికలకు ముందే కూటమి పార్టీల్లో ఆశలు ఇలా ఉంటే..సీట్ల పంపకాలు, ఫలితాలు..తర్వాత మేయర్ రేసు ఎలా ఉంటుందో చూడాలి మరి.

# అభివృద్ధి అంటే ఆర్థిక పురోగతి కాదు...!

### సామాజిక సమానత్వం... పర్యావరణ సమతుల్యత... ప్రకృతి వనరుల పరిరక్షణ

### మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ రామకృష్ణ రెడ్డి

**విజయనగరం, ఫిబ్రవరి 26, జయ జయహే**







ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్ర విభాగానికి చెందిన భూగర్భ శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న "ప్రకృతి వనరుల నిర్వహణ మరియు స్థిరమైన అభివృద్ధి" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం. రామకృష్ణ రెడ్డి, గౌరవ అతిథిగా ఆంధ్రప్రదేశ్ అంతరిక్ష వినియోగ కేంద్రం పరిపాలన డైరెక్టర్ సి. హెచ్. తాత బాబు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, ప్రకృతి వనరుల సమర్థ వినియోగం, సంరక్షణ అంశాలు నేటి విద్యా, పరిశోధనా రంగాలలో అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా విశ్వవిద్యాలయం కట్టుబడి పనిచేస్తోందని, ఇలాంటి జాతీయ సదస్సులు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు ఒకే వేదికపై చర్చించేందుకు అవకాశమిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎం. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణతో కూడిన స్థిరమైన అభివృద్ధి నేటి ప్రపంచ సమాజానికి అత్యవసర ఆవశ్యకతగా మారిందన్నారు. అభివృద్ధి అనేది కేవలం ఆర్థిక పురోగతితో పరిమితం కాకుండా, పర్యావరణ సమతౌల్యం, సామాజిక సమానత్వం మరియు భవిష్యత్ తరాల అవసరాల పరిరక్షణను సమన్వయం చేసుకునే సమగ్ర ప్రక్రియగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. నీటి వనరులు, భూమి, ఖనిజ సంపద, అటవీ వనరులు వంటి సహజ సంపదను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు జీవనాధారంగా ఉండటంతో, అక్కడి అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక అవసరాలు మరియు సంప్రదాయ జ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాటాడుతూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయాల పాత్ర అత్యంత ప్రాముఖ్యమైనదని పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలు విద్యాబోధనతో పాటు సమాజ సమస్యలకు శాస్త్రీయ ఆధారిత పరిష్కారాలను అందించే కేంద్రాలుగా ఎదగాలని సూచించారు. అంతరశాఖల సహకారం, సమగ్ర పరిశోధన, విద్యార్థుల్లో పరిశోధనాసక్తి పెంపొందించడం ద్వారా ప్రకృతి వనరుల సమర్థ నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు. ఈ సదస్సు శాస్త్రీయ చర్చలకు వేదికగా నిలిచి, సమాజానికి ప్రయోజనకరమైన మార్గదర్శక సూచనలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పలువురు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ భూగర్భ శాస్త్ర విభాగాధిపతి డా. సురేష్ బాబు కలిదిండి, నిర్వహణ కార్యదర్శి డా. మన్నాల ప్రసాద్, అతిథి అధ్యాపకులు డా. జి. సూర్యనారాయణ, డా. జి. వీరాస్వామి, డీన్ ప్రొఫెసర్ సరత్‌చంద్ర బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### విశాఖ ట్రాఫిక్‌పై సీఎం

# ప్రతీ వారం సమీక్షించాలి

### భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభమైతే యిబ్బందే

### పదేళ్ల క్రితం వేసిన రోడ్డులే.. అసెంబ్లీలో ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**

ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీఆర్డీఏ మాదిరిగా ప్రతి వారం విశాఖ ట్రాఫిక్ పై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష జరపాలని సూచించారు. జూన్ 26 న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ సమస్య మరింత జటిలం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా మెట్రో, కోస్టల్ కారిడార్, ఫ్లయ్ ఓవర్లు ప్రతిపాదించినప్పటికీ, వాటి నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. విశాఖలో 30 ఏళ్ల క్రితం రోడ్లు విస్తరించగా, వాహనాల సంఖ్య 5 రెట్లు పెరిగిందని తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్ సహా ఐటీ.. టూరిజం.. ప్రాజెక్టులు ఏర్పాటు కానున్న నేపథ్యంలో రాబోయే 4-5 ఏళ్లలో లక్ష మంది ఉద్యోగులు విశాఖ వస్తారని, ఆ స్థాయిలో వాహనాలు పెరిగితే ట్రాఫిక్ పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని పేర్కొన్నారు.



# ఘనంగా నున్నా కృష్ణ జన్మదిన వేడుకలు

### మహిళలకు చీరలు - విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకుడు నున్నా కృష్ణ జన్మదిన వేడుకలు రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. శానిటోరియం సంతోష్ నగర్‌లో టీడీపీ నాయకుడు గున్నూరి అశోక్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 200 మంది మహిళలకు చీరలు, 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టినరోజును సేవా దృక్పథంతో జరుపుకోవడం అభినందనీయమని అభిమానులు పేర్కొన్నారు. నాయకుడు నున్నా కృష్ణ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని, ప్రజలకు అండగా నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గున్నూరి అశోక్, వేమగిరి రాజు, కొల్లి సుబ్రహ్మణ్యం, సతీష్, పెద్దపూడి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


### స్వర్ణ వార్డు-స్వర్ణ గ్రామం గందరగోళం

# తొలగించండి!

### కార్యాలయాల పేర్ల మార్పుపై

### అసెంబ్లీలో ప్రభుత్వ విప్ గణబాబు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**



స్వర్ణ వార్డు - స్వర్ణ గ్రామం కార్యదర్శులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను ప్రభుత్వ విప్ గణబాబు గురువారం అసెంబ్లీ లో ప్రస్తావించారు. ఈ కార్యాలయాల పేర్ల మార్పుపై పలు కీలక అంశాలను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యాలయాల పేర్లు, వాటి పరిధిలోని గ్రామాల పేర్లు పొంతన లేకపోవడం వల్ల పరిపాలనలో గందరగోళం ఏర్పడుతోందని, దీనిని తొలగించేలా తక్షణమే సరైన పేర్లు నిర్ధారించి మార్పులు చేయాలని కోరారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 అమలులో కీలకంగా పనిచేస్తూ ఇప్పటికే ఆరు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వర్ణ వార్డు - స్వర్ణ గ్రామం కార్యదర్శులపై వివిధ శాఖల అధికారుల నుండి వస్తున్న అధిక వత్తిడి తగ్గించే విధంగా పరిపాలనా అధికారాలను జిల్లా స్థాయిలో ఒక గవర్నింగ్ బాడీ ఆధ్వర్యంలో సమన్వయం చేయాలని సూచించారు. ఈ చర్యలు తీసుకుంటే పరిపాలన మరింత సమర్థవంతంగా మారి, గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలు సజావుగా అందుతాయని ఆయన స్పష్టం చేశారు.



### అమ్మవారి పునఃనిర్మాణ కలశ స్థాపన ప్రతిష్ట

# ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**అనకాపల్లి జయ జయహే**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది మార్చి 8 న అమ్మవారు పునఃనిర్మాణ కలశ స్థాపన ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరుగనున్నవి ఈ సందర్భంగా నుకాంబిక పాలకవర్గ సభ్యులు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పార్టీ కార్యాలయంలో గురువారం దేవస్థానం పాలకవర్గ సభ్యులు అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించడం జరిగింది. ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు అన్నీ పరిపూర్ణంగా ఉండాలని ఆయన వారికి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీల నాగ శ్రీను (గొల్ల బాబు) సహాయ కమిషనర్ యాల శ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, డాడీ రవికుమార్, కొడుకుల శ్రీకాంత్, మజ్జి జానకి శ్రీనివాసరావు, కాంద్రేగుల రాజారావు, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, నాగేష్ ,వద్దాది మంగ, ఎర్రవరపు సంతోష్ కుమారి, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు పాల్గొన్నారు




### జనసేన పార్టీ క్రియాశీలక

# సభ్యత నమోదు ప్రారంభం

**అనకాపల్లి (జయ జయహే )**

రాష్ట్రంలో నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమం అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక తొలి సభ్యత్వం నమోదులో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తన పార్టీ కార్యాలయంలో గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నుండి ప్రారంభమైందని, పార్టీ భావజాలం లోతుగా అర్థం చేసుకుని పార్టీ సిద్ధాంతాలు ఆశయాలు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో, ఎవరైతే పార్టీలో నాయకుడుగా ఎదగాలనుకుంటున్నారు వారు క్షేత్రస్థాతే పనిచేసే కార్యకర్త ప్రజల కష్టాన్ని గుర్తించిన నాడు అలాగే కార్యకర్తల కష్టాన్ని కూడా గుర్తించిన నాయకుడు పార్టీలో సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు వీర మహిళలు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది. మండలాల్లో, గ్రామాల్లో పార్టీపై అభిమానం మక్కువ ఉన్న వారిని పార్టీ సభ్యత్వం నమోదు చేయించాలని అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసిన వారికి పార్టీ వారిని గుర్తించే వారికి బిరుదులు ఇచ్చి సన్మానించడం జరుగుతుందని కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.



# కేంద్ర మంత్రులను కలిసిన కెఎన్ఆర్

**విశాఖపట్నం (జయ జయహే)**

కేంద్ర మత్స్య పశుసంవర్ధక పాడిపరిశ్రమల, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్.పి సింగ్ భగేల్ మరియు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను విశాఖ విమానాశ్రయంలో ఘణంగా వీడ్కోలు పలికిన బిజేపి జిల్లా అధ్యక్షులు పరశు రామరాజు రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు జిల్లా ఎస్సి మోర్చా అధ్యక్షుడు ములకలపల్లి ప్రకాష్ బొత్య సురేష్,బొత్స దిలీప్ కుమార్ , రాకేష్, మంజుల ,మనోహర్ తదితరులు.





# రైల్వే ఉద్యోగంతో జీవితం సుసంపన్నం

### వాల్తేర్ డీ ఆర్ ఎం లలిత్ బోహ్రా

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**

ఉద్యోగుల వల్ల రైల్వే బలోపేతం కావడంతో పాటు వారి వ్యక్తిగత జీవితం సుసంపన్నం కానుందని డీ ఆర్ ఎం లలిత్ బోహ్రా అన్నారు. వాల్తేర్ డివిజన్లో దాదాపు 50మంది రైల్వే ఉద్యోగులు రిటైర్ కానున్నారు. ఈ సందర్భంగా గురువారం శ్రీనివాస కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురుని ఆయన సన్మానం చేశారు. ఈ సందర్భంగా డీ ఆర్ ఎం మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక అనివార్యమైన మైలురాయి అని అన్నారు. పదవీ విరమణ తర్వాత కుటుంబానికి నాణ్యమైన సమయాన్ని కేటాయించడానికి, సమాజానికి అర్థవంతమైన సేవలో పాల్గొనడానికి అవకాశం లభిస్తుందని నొక్కి చెప్పారు. రైల్వేల వృద్ధి మరియు అభివృద్ధికి పదవీ విరమణ చేసే ప్రతి ఉద్యోగి చేసిన విలువైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. వారి అంకితభావంతో కూడిన సేవ సంస్థను బలోపేతం చేయడమే కాకుండా వారి వ్యక్తిగత వృత్తిపరమైన జీవితాలను కూడా సుసంపన్నం చేసిందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి స్వాగతం పలుకుతూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జుసుఫ్ కబీర్ అన్సారీ మాట్లాడుతూ ఈ నెలలో 50 మందికి పైగా రైల్వే ఉద్యోగులు పదవీ విరమణ చేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా, మరణించిన ఆరుగురు రైల్వే ఉద్యోగులకు సంబంధించి కుటుంబ పెన్షన్ సెటిల్మెంట్లను కూడా అందజేశారు, వారి కుటుంబాలకు మద్దతు తెలిపారు. రైల్వేలకు వారి అంకితభావ సేవకు గుర్తింపుగా పదవీ విరమణ చేసిన వారికి సెటిల్మెంట్ పత్రాలు, జ్ఞాపికలు మరియు సత్కారాలతో వేడుక ముగిసింది.

# తిరుమల ప్రతిష్ట పెంచింది వైఎస్ఆర్, జగన్‌లే

## హిందూమత సంరక్షణకు అనేక చర్యలు

## వైకాపా ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



తిరుమల ప్రతిష్టను పెంచింది వైఎస్సార్, వైఎస్ జగన్‌లేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. ఆమె గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ఇంటి దైవం అంటూనే చంద్రబాబు శ్రీవారి ప్రసాదంపై నింద మోపాడంటూ.. ఆధారాలతో కూటమికి వరుదు కళ్యాణి కౌంటర్ ఇచ్చారు. హిందూ మతాన్ని పరిరక్షిస్తామంటూనే తమ చర్యలతో కూటమి నాయకులు అడుగడుగునా హిందూ సాంప్రదాయాలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కడపలోని వేంపల్లెలో నందీశ్వర ఆలయాన్ని ప్రారంభిస్తే దానిపైనే ఫేక్ వీడియాలతో తెలుగుదేశం సోషల్ మీడియా విషం కక్కింది. టీడీపీ అంటేనే టెంపుల్ డిమాలిషన్ పార్టీ అని అర్థం. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా విజయవాడలో పుష్కరాల పేరుతో 40కి పైగా ఆలయాలను కూల్చేస్తే, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిర్మించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని కూల్చివేశారు. ముఖ్యమంత్రులుగా ఉండి తిరుమల ప్రతిష్టను, స్వామి వారి వైభవాన్ని పెంచిన ఘనత తండ్రీకొడుకులు వైఎస్సార్, వైఎస్ జగన్‌లకే దక్కుతుంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు చేసి తెలుగు రాష్టాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 4,111 కొత్త ఆలయాల నిర్మాణాలు మొదలు పెట్టి ఒక్కదానికి రూ.10 లక్షలు కేటాయించడం జరిగింది. అందులో 80 శాతం పనులు రామాలయాలే. రూ. 411 కోట్లతో 801 పురాతన ఆలయాల ఆధునికీకరణ పనులు చేయడం జరిగింది. దుర్గ గుడి అభివృద్ధి కోసం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ నిధులు రూ.70 కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా దుర్గమ్మ ఆలయంలో రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.తూర్పు గోదావరి జిల్లా అంతర్వేదిలో లక్ష్మీ నారాయణ స్వామి రథానికి దుండగులు నిప్పంటిస్తే కళ్యాణోత్సవం సమయానికి కొత్త రథం తయారు చేయించి ఇస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన రథాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన నవనీత సేవ కోసం స్వచ్ఛమైన వెన్నను సమకూర్చడం కోసం తిరుమలలోని గోశాలను విస్తరించడం వైయస్ జగన్ సీఎంగా ఉండగానే జరిగింది. చిన్నారుల్లో భక్తిభావం పెంపొందించడం కోసం గోవింద కోటి, రామ కోటి రాసే వారికి ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేయడమే కాకుండా వారికి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శన భాగ్యం కల్పించడం జరిగింది.టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలతోపాటు వేతనాలు పెంచడమే కాకుండా కారుణ్య నియామకాలు చేపట్టారు. వంశ పారంపర్య అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా ఓపిక ఉన్నంత వరకు స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించారు. తిరుమలలోని స్వామి వారి గర్భగుడిని సన్నిధి గొల్లలు తెరిచే సాంప్రదాయాన్ని పునరుద్ధరించారు. అమరావతి, చెన్నై, భువనేశ్వర్, జమ్ముకశ్మీర్, విశాఖపట్నంతోపాటు అమెరికాలో శ్రీవారి ఆలయాలను నిర్మించి స్వామి వారి ప్రతిష్టను ప్రపంచవ్యాప్తం చేశారు. గతంలో దివంగత వైఎస్సార్ తరహాలోనే వైఎస్ జగన్ కూడా ముఖ్యమంత్రిగా ఉండగా వేద విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్యమైన గరుడ సేవలో భక్తులందరూ దర్శించు కునేలా ప్రతి పౌర్ణమికి పున్నమి గరుడ సేవ నిర్వహించేలా నిర్ణయం తీసుకోవడం జరిగింది. మఠాధిపతులు, ఆగమ పండితులతో ఆగస్టు 2022లో రెండో విడత ధార్మిక పరిషత్తును నియమించి నిర్ణయాధికారాలను కల్పించిన ఘనత కూడా వైఎస్ జగన్‌కే దక్కుతుంది. హిందూ ధర్మ పరిరక్షణ, స్వామి వారి ప్రతిష్టను ఇనుమడింపజేయడం కోసం వైయస్సార్ ఎంతో శ్రమించారు. కానీ చంద్రబాబు మాత్రం మా ఇంటి దైవం అంటూనే తన తప్పుడు ప్రకటనలతో ఆలయ ప్రతిష్టను మంటగలిపేశారని కళ్యాణి అన్నారు.

# ఐడిఎఫ్‌సి ఉదంతం కనువిప్పు కావాలి

(సి.హెచ్.ప్రతాప్)

***ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో ఇటీవల రూ.590 కోట్ల భారీ మోసం వెలుగులోకి రావడం దేశంలోని డిజిటల్ బ్యాంకింగ్ భద్రతపై అనేక సందేహాలను లేవనెత్తుతోంది. చండీగఢ్ బ్రాంచ్‌లో హర్యాణా ప్రభుత్వ ఖాతాలతో సంబంధం కలిగి ఉన్న అకౌంట్లలో ఆ బ్యాంకు ఉద్యోగులే అనధికారిక లావాదేవీలు చేపట్టడం గమనార్హం. బ్రాంచ్ మేనేజర్ మరియు అతని సహచరులు నకిలీ చెక్కులతో నిధులను బయటి కంపెనీలకు మళ్లించారు. ఈ అక్రమ నిధుల మళ్లింపులో మేనేజర్ భార్యకు చెందిన స్వాస్తిక్ దేశ్ ప్రాజెక్ట్స్ అనే సంస్థ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. ఖాతా మూసివేసే సమయంలో నిల్వ మొత్తంలో తేడాలను గుర్తించిన బ్యాంకు వెంటనే పోలీసులకు మరియు భారతీయ రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో హర్యాణా అవినీతి నిరోధక విభాగం నలుగురు నిందితులను అరెస్ట్ చేసింది. ఈ మోసం ఇతర బ్రాంచ్‌లకు వ్యాపించలేదని బ్యాంకు వివరణ ఇచ్చినప్పటికీ ఈ ఉదంతం దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక నేరాల తీవ్రతకు ఒక మేలుకొలుపుగా మారింది. ఒక ప్రభుత్వ ఖాతా నుండి సైతం నిధులు మాయం కావడం అనేది ప్రస్తుత బ్యాంకింగ్ రక్షణ వ్యవస్థలో ఉన్న అంతర్గత లోపాలను ఎత్తి చూపుతోంది. సాంకేతికత ఎంతగా విస్తరిస్తుందో అదే స్థాయిలో మోసగాళ్లు కూడా వ్యవస్థలోని మనుషులను మరియు లొసుగులను వాడుకుంటున్నారు అనడానికి ఇది ఒక స్పష్టమైన నిదర్శనం. ప్రజలు తమ కష్టార్జితాన్ని బ్యాంకులలో భద్రంగా ఉంటుందని భావిస్తున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని సడలిస్తున్నాయి.***




నేటి కాలంలో డిజిటల్ చెల్లింపులు మరియు ఆన్‌లైన్ బ్యాంకింగ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగంగా మారింది. అయితే ఈ సౌకర్యంతో పాటు ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఐడీఎఫ్‌సీ మోసం ద్వారా మనం గ్రహించవలసిన ప్రధాన అంశం ఏమిటంటే కేవలం రహస్య సంకేతాలు లేదా వన్ టైమ్ పాస్‌వర్డ్‌లు మాత్రమే భద్రతకు హామీ ఇవ్వలేవు. సాంకేతిక లోపాలను మరియు వ్యవస్థలో ఉన్న వ్యక్తులు చేసే అక్రమాలను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు చొరబడుతున్నారు. ఒకరి ప్రమేయం లేకుండానే ఖాతాలను నిర్వహించడం లేదా నిధులను ఇతర కంపెనీలకు తరలించడం వంటివి అత్యంత ఆందోళన కలిగించే విషయాలు. ఇది దేశంలోని ఆర్థిక నిబంధనల అమలులో ఉన్న సన్నని రంధ్రాలను నేరగాళ్లు ఎలా వాడుకుంటున్నారో తెలియజేస్తోంది.

ఈ ఘటన దేశానికి ఒక హెచ్చరిక వంటిది. ప్రభుత్వ యంత్రాంగం మరియు బ్యాంకింగ్ నియంత్రణ సంస్థలు తమ భద్రతా ప్రమాణాలను యుద్ధ ప్రాతిపదికన సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. బ్యాంకులు కేవలం తమ లాభాలను పెంచుకోవడంపైనే కాకుండా వినియోగదారుల దత్తాంశ భద్రత మరియు అంతర్గత నిఘాపై భారీగా పెట్టుబడులు పెట్టాలి. నిరంతరం మారుతున్న మోసపూరిత వ్యూహాలను ఎదుర్కోవడానికి కృత్రిమ మేధస్సు మరియు అధునాతన తనిఖీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రతి చిన్న లావాదేవీని నిశితంగా




పరిశీలించే వ్యవస్థలు ఉండాలి. అనుమానాస్పద కార్యకలాపాలు జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందేలా వేగవంతమైన స్పందన యంత్రాంగం అవసరం.

మరోవైపు సామాన్య ప్రజలలో ఆర్థిక అక్షరాస్యతతో పాటు సైబర్ భద్రతపై అవగాహన పెరగాలి. బ్యాంకులు తమ వినియోగదారులకు భద్రతా జాగ్రత్తల గురించి నిరంతరం సమాచారం అందించాలి. చట్టాలు కూడా నేరగాళ్లకు కఠినమైన శిక్షలు పడేలా ఉండాలి. ముఖ్యంగా బ్యాంకు లోపల ఉండి ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాల దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రత్యేక విభాగాలను బలోపేతం చేయాలి. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా మరియు పోగొట్టుకున్న సొమ్ము తిరిగి వచ్చేలా కఠినమైన నియమ నిబంధనలు రూపొందించాలి.

భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా ఉండాలంటే సాంకేతిక నిపుణులు ప్రభుత్వాలు మరియు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండాలంటే బ్యాంకింగ్ లావాదేవీల పట్ల ప్రజలకు మరియు ప్రభుత్వ సంస్థలకు భరోసా ఉండటం అత్యంత ముఖ్యం. ఐడీఎఫ్‌సీ మోసం అనేది ఒక పాఠంగా మారి భవిష్యత్తులో మరింత సురక్షితమైన బ్యాంకింగ్ వాతావరణాన్ని నిర్మించడానికి దారితీయాలి. అప్రమత్తత మాత్రమే ఆర్థిక దాడుల నుండి మనల్ని కాపాడుతుంది. ప్రతి వ్యవస్థ తన విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి. అప్పుడే మన దేశ ఆర్థిక భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. సాంకేతికతను వాడుకోవడంలో వేగంతో పాటు పారదర్శకతను కూడా ప్రదర్శించడం నేటి అవసరం.

# ప్రజారోగ్యాన్ని హరిస్తున్న కల్తీపాలు

(సి.హెచ్.ప్రతాప్)

ఆరోగ్యానికి అమృతం వంటి పాలు నేడు స్వార్థపరుల ధనదాహానికి విషంగా మారుతున్నాయి. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ ఇష్టంగా తాగే పాలలో రసాయనాలను కలపడం వల్ల ప్రజారోగ్యం తీవ్ర ముప్పులో పడుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అలాగే తెలంగాణ రాష్ట్రాల్లో వెలుగుచూసిన కల్తీ పాల ఉదంతాలు సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో ఫిబ్రవరి 2026లో జరిగిన విషాద సంఘటన కల్తీ పాల తీవ్రతకు అద్దం పడుతోంది. ఒక ప్రైవేటు డెయిరీ నుండి పాలు సేకరించిన చౌడేశ్వరి నగర్ అలాగే స్వరూప్ నగర్ వాసులలో సుమారు 14 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నలుగురు వ్యక్తులు కిడ్నీలు దెబ్బతిని మరణించడం అత్యంత బాధాకరం. బాధితుల రక్త నమూనాలను పరీక్షించగా పాలలో ఇథిలీన్ గ్లైకాల్ మరియు అధిక మోతాదులో యూరియా కలిసినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. తెలంగాణలో కూడా హైదరాబాద్ వంటి నగరాల్లో లూజ్ పాల విక్రయాల్లో డిటర్జెంట్లు, స్టార్చ్ వంటివి కలుపుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

కల్తీ పాల వెనుక ప్రధానంగా అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా లాభార్జన కోసం పాల పరిమాణాన్ని పెంచడానికి నీటిని కలపడం, ఆ పాలు చిక్కగా కనిపించడానికి స్టార్చ్, పిండి లేదా యూరియా వంటివి జోడిస్తున్నారు. పాలు త్వరగా పాడవకుండా నిల్వ సామర్థ్యం పెంచడానికి ఫార్మాలిన్, హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను కలుపుతున్నారు. పండగలు మరియు ప్రత్యేక సందర్భాల్లో పాల డిమాండ్ పెరిగినప్పుడు కృత్రిమంగా పాలను తయారు చేసేందుకు డిటర్జెంట్ పొడి, వంట నూనె మరియు రసాయనాలను వాడుతున్నారు. కల్తీ పాలు తాగడం వల్ల తక్షణమే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఇవి కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు, చూపు మందగించడం మరియు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయి. ముఖ్యంగా గర్భిణీలు మరియు పసిపిల్లలపై వీటి ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది.

ప్రభుత్వం ఈ విషయంలో కఠినమైన చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజల ప్రాణాలను కాపాడగలదు. ఆహార కల్తీ



నియంత్రణ చట్టం కింద బాధ్యులకు జీవిత ఖైదు అలాగే భారీ జరిమానాలు విధించాలి. రాజమహేంద్రవరం ఘటనలో ప్రభుత్వం బాధితులకు 10 లక్షల రూపాయల పరిహారం ప్రకటించడమే కాకుండా దోషులను తక్షణమే అరెస్ట్ చేసింది. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడే కాకుండా డెయిరీలు మరియు విక్రయ కేంద్రాలపై ఆహార భద్రతా అధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో పాల స్వచ్ఛతను పరీక్షించే ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలి. తిరుమలలో మాదిరిగా ప్రతిచోటా కల్తీని గుర్తించే వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. పశువులకు ఇచ్చే మేతలో కూడా రసాయనాలు లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. పాల సేకరణ కేంద్రాల వద్దే పరీక్షలు నిర్వహించేలా గ్రామ స్థాయిలో చిన్న చిన్న ల్యాబ్‌లను ప్రోత్సహించాలి.

ప్రజలు కూడా ప్యాకెట్ పాలు లేదా గుర్తింపు పొందిన డెయిరీల నుండే పాలను కొనుగోలు చేయాలి. పాలలో కల్తీని గుర్తించే సులభమైన పద్ధతులపై ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించాలి. ఉదాహరణకు ఒక చుక్క పాలను నునుపైన ఉపరితలంపై వేసినప్పుడు అది మెల్లగా కిందికి జారితే స్వచ్ఛమైనదని, వెంటనే జారిపోయి తెల్లటి చారలు కనిపిస్తే నీరు కలిసినట్లు గుర్తించవచ్చు. పాలల్లో అయోడిన్ కలిపినప్పుడు అది నీలం రంగులోకి మారితే స్టార్చ్ ఉన్నట్లు అర్థం. ఇటువంటి చిన్నపాటి అవగాహన ప్రాణాలను కాపాడుతుంది. కల్తీ అనేది కేవలం నేరం కాదు అది సామూహిక హత్యతో సమానం. ప్రభుత్వం మరియు ప్రజలు సమన్వయంతో వ్యవహరించినప్పుడే కల్తీ రహిత సమాజాన్ని నిర్మించగలం. పాడి రైతులను ప్రోత్సహిస్తూ నేరుగా వినియోగదారులకు పాలు చేరేలా సహకార సంఘాలను బలోపేతం చేయడం ఒక మంచి పరిష్కారం.



## ఫిర్యాదు దారులను కూర్చోబెట్టి

# సమస్య వినండి!

## పెందుర్తి పోలీసులకు సీపీ సూచన

పెందుర్తి, ఫిబ్రవరి 22, జయ జయహే

నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించారు. స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, ఆయా ఖాళీ ప్రాంతాలను శుభ్రము చేయించాలని ఆదేశించారు. మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, స్టేషన్ నందు ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలనీ ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు అప్డేట్ గా ఉండాలని, స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారులతో స్పందిస్తున్న తీరు తెలుసుకొని , ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ వారి సమస్యలను కూర్చోబెట్టి వినాలని, వాటిని పారదర్శకముగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కారించాలని తెలిపారు, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ యొక్క ప్రతి కదలిక ఎల్లవేళలా పరిశీలించాలనీ, గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలనీ, స్టేషన్ల పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన అదేశాలు జారీ చేశారు, విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. స్టేషన్ సీఐ సతీష్ కుమార్,ఎస్ ఐ, పోలీసులు సీపీ వెంట వున్నారు.

## కల్తీ పాలు, కలుషిత జలాలపై సీఎం

# చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్

### జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన దిశా నిర్దేశం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో కల్తీ పాలు, కలుషిత జలాల సమస్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం అమరావతి నుంచి తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

స్థానిక కలెక్టరేట్ నుంచి జరిగిన ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ఎంసీ, పశుసంవర్ధక శాఖ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.




**అప్రమత్తతతో చర్యలు తీసుకోవాలి**

వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించి, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యలను మూలం నుంచే గుర్తించి, ఎటువంటి ఉదాసీనతకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని స్పష్టం చేశారు.

డేటా విశ్లేషణ ఆధారంగా సమస్యల పరిష్కార మార్గాలను రూపొందించాలని, సిద్ధాంతాత్మకంగా కాకుండా ఆచరణ సాధ్యమైన చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని, ఆడిట్ ఫలితాలు, ల్యాబ్ రిపోర్టులను ఫీల్డ్ పరిశీలనలతో సమన్వయం చేయాలని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. శనివారం మరోసారి సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

**బాధితులకు ఆధునిక వైద్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితులు చికిత్స పొందుతున్న ఆసుపత్రుల వైద్యులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ప్రతి రోజు ఆసుపత్రులకు వెళ్లి బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతున్నామని పేర్కొన్నారు.

డయాలసిస్ కోసం డిస్పోజబుల్ హీమోపెర్ఫ్యూషన్ వంటి ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ రైన్‌బో ఆసుపత్రి సహకారంతో మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు.

**20 మంది అడ్మిషన్లు -5 మృతి**

కలెక్టర్ కీర్తి చేకూరి వివరాల ప్రకారం, ఘటనకు సంబంధించినంగా మొత్తం 20 మంది ఆసుపత్రుల్లో చేరగా, వారిలో 5 మంది మరణించారు. ప్రస్తుతం 15 మంది చికిత్స పొందుతున్నారు. బాధితులు అనూరియా (మూత్ర విసర్జన లేకపోవడం), వాంతులు, కడుపు నొప్పి, తీవ్రమైన మూత్రపిండ వైఫల్య లక్షణాలతో చౌడేశ్వర నగర్, స్వరూప నగర్, లాలాచెరువు ప్రాంతాల నుంచి ఆసుపత్రుల్లో చేరినట్లు తెలిపారు.ప్రాథమిక క్లినికల్ ఫలితాల ఆధారంగా విషపూరిత పాల కారణంగా కిడ్నీ పనితీరు దెబ్బతిన్నట్లు వైద్యులు సూచించినట్లు వెల్లడించారు. ఎపిడెమియోలాజికల్ పరిశీలనలో పాల వినియోగం మరియు కేసుల మధ్య సంబంధం ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ల్యాబ్ పరీక్షల పూర్తి నివేదికల తర్వాత వాస్తవ కారణాలపై స్పష్టత రానుంది.

ఘటన అనంతరం 9 వైద్య బృందాలు 110 గృహాలను సందర్శించి 315 రక్త నమూనాలు సేకరించాయి. అదనంగా 14 సర్వైలెన్స్ బృందాలు 957 కుటుంబాలను ప్రతిరోజూ స్క్రీనింగ్ చేస్తున్నాయని తెలిపారు.

**వెండర్ అదుపులో**

ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత వెండర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించామని తెలిపారు. వినియోగదారులు పాల్లో తేడా గమనించినట్టు వెల్లడించారు. పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

"ప్రజల ప్రాణాలను కాపాడడం, వెంటనే వైద్య చర్యలు చేపట్టడం, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని అధికారులు స్పష్టం చేశారు.



## అనూరియా బాధితులకు మంత్రి

# కందుల దుర్గేష్ మనోధైర్యం

### కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శ -రూ.10 లక్షల పరిహారం హామీ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ పాల ఘటనకు గురైన అనూరియా బాధితులను రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం స్వయంగా పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్షించి, వెంటిలేటర్లపై ఉన్న వారికి ధైర్యం చెప్పారు. కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**బాధితులకు భరోసా -మెరుగైన వైద్యం**

ఈ ఘటన అత్యంత హృదయవిదారకమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులతో కలిపి మొత్తం 15 మంది ప్రభావితమయ్యారని తెలిపారు. ప్రస్తుతం 8 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, నలుగురి పరిస్థితి విషమంగానే ఉన్నప్పటికీ కోలుకునే సూచనలు ఉన్నాయని వైద్యులు వెల్లడించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వైద్యానికి అయ్యే ప్రతి పైసాను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రత్యేక వైద్య బృందం - 'ఫోమి ఫీజోల్' డ్రగ్ వినియోగం**

డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో నిపుణుల బృందం బాధితులకు చికిత్స అందిస్తోందని మంత్రి తెలిపారు. విషతుల్య ప్రభావాలను తగ్గించే 'ఫోమి ఫీజోల్' ఔషధం వాడుతున్నామని చెప్పారు. ఈ ఔషధాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చొరవ ప్రశంసనీయమన్నారు.

**నిందితులపై ఉక్కుపాదం**

కల్తీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే నమూనాలు సేకరించామని, నివేదికలు రాగానే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేయాలనుకునే వారికి ప్రభుత్వం తగిన గుణపాఠం చెబుతుందన్నారు.

**రాజమహేంద్రవరంలోనే టెస్టింగ్ సెంటర్**

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పరీక్షల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాజమహేంద్రవరంలోనే అత్యాధునిక టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని వెల్లడించారు. ప్రజలు ఆహారం, పాలు, నీరు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

## నూతన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట

**కొయ్యురు (జయ జయహే ) న్యూస్ ఫిబ్రవరి 27**


*అల్లూరి జిల్లా కొయ్యురు మండల పరిధి మర్రివాడ గ్రామం లో నూతన ఆలయం, సీతా రాముల విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది.వేద పండితులు తో నూతన విగ్రహలకు అబిషేకాలు హోమాలు జరిపించారు. ఉదయం నుంచే గ్రామ పెద్దలు, పూజారులు, గ్రామ ప్రజలు ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కోసం పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట పూర్తయ్యాక, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమం లో దొడ్డవరం, పిడతమామిడి, గుడ్లపల్లి ప్రజలు, భక్తి శ్రద్దల తో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.*




## కొండెంపూడిలో ఘనంగా

# విగ్రహ ప్రతిష్ట

**బుచ్చయ్యపేట జయ జయహే**



మండలంలోని కొత్త కొండెంపూడిలో గురువారం సీతా సమేత రామచంద్ర మూర్తి ఆలయ విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి హోమాదికాలు పూజలు నిర్వహిస్తున్నారు. శాస్త్రోక్తంగా పూజలు జరిపించి విగ్రహ ప్రతిష్ట చేసి ఆలయాన్ని ప్రారంభించారు.గణపతి లక్ష్మీదేవి,సీతారామచంద్రమూర్తి విగ్రహాలను ప్రతిష్టించారు.భక్తులు దాతలు గ్రామస్తుల సహకారంతో సుమారుగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.శిఖర యంత్రం ప్రారంభం సందర్భంగా భక్తులు గోపురం పైకి బూరెలు విసిరి పట్టుకున్నారు.భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు.భక్తులకు అన్నదానం చేశారు.పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.జై శ్రీరామ్ నినాదాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.మాజీ మంత్రి,జిల్లా వైసీపీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, జడ్పిటిసి దొండా రాంబాబు, మండల వైసీపీ అధ్యక్షుడు జోగా కొండబాబు,నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాల నాయుడు,స్వామి విష్ణు దాసానంద సర్వస్వం, స్థానిక సర్పంచ్ ఆది సత్యనారాయణ,వడ్డాది పిఏసిఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్, పాల సంఘం అధ్యక్షుడు దొండా శ్రీను, మాజీ సర్పంచులు ఆది సూర్య ప్రకాష్, అధట్రావు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డాదిలో వెంకన్న కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

### ఈనెల 26 నుండి మార్చి 4 వరకు

**బుచ్చయ్యపేట జయ జయహే**

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వెంకన్న స్వామి 153వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈనెల 26వతేదీ గురువారం నుండి మార్చి5వతేదీ బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 26వతేదీ గురువారం రాత్రి స్వామి వారి దొంగపెళ్లి, ధ్వజారోహణతో ప్రారంభమై మార్చి4వతేదీ పుష్పాంజలితో ముగుస్తాయి.ఇందులో భాగంగా శుక్రవారం ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, హోమాదికములు, తిరువీధి,కళ్యాణ మహోత్సవం,మార్చి1న తిరువీదోత్సవం, సదస్యం,మార్చి3వ తేదీ మంగళవారం నాగవల్లి చక్రస్నానం నిర్వహిస్తారు.ఈ ఏడాది నాగవల్లి రోజున చంద్రగ్రహణం ఉన్నందున స్వామివారి చక్రస్నానం ఉదయం 11 గంటల లోపు కొండపైనే ముగించి ఆలయాన్ని మూసివేయనున్నారు. మళ్లీ మరుసటి రోజు తెల్లవారుజామున మాత్రమే ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి.పురవీధుల్లో ఊరేగింపు, వసంతోత్సవం రద్దు చేశారు.ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ వైకుంఠ ఏకాదశికి వడ్డాది గిరిజాంబ గిరిపై శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

**స్థలపురాణం.**

ఈఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది.154 ఏళ్ల క్రితం శ్రీనారాయణ భజ్ అనే యోగి వచ్చి వడ్డాదికి దక్షిణ దిశగా వెంకటేశ్వర స్వామి నెలకొల్పపడతారని అది



పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశసంచారం నిమిత్తం వెళ్లిపోయారు.యోగి వెళ్లిన మరుసటి ఏడాదే గిరిజాంబగిరికి ఉత్తర దిశగా ఉన్న విజయరామరాజు పేటలో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా పది అడుగుల లోతులో వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి,భూదేవి విగ్రహాలు బయటపడ్డాయి.ఈవిషయాన్ని అప్పటి గ్రామపెద్ద దొండా భగవంతులయ్య దొరకు తెలియజేయడంతో విగ్రహాలను వడ్డాది గిరిజాంబగిరికి రప్పించి పురాణయుక్తంగా దేవాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట చేయించారు.నాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా స్వామికి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల మాగాణి విరాళంగా ఇచ్చారు.1970 దశకంలో ఆలయం దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్లింది. ఈస్థలానికి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉన్నట్లుగా సింహాచలం దేవస్థానం ప్రచురణలలో పేర్కొన్నారు. మహాభారతంలో పాండవుల అజ్ఞాతవాసంలో విరాటరాజు పాలించిన మత్స్యదేశ రాజధాని అయిన విరాటపురమే నేటి వడ్డాది అని తెలుస్తోంది. పాండవులు గిరిజాంబగిరిని ఆనుకొని ఉన్న చెరువులో స్నానమాచరించి సంధ్యావందనం చేసేవారని,కనుకనే ఈచెరువును పాండవుల చెరువుగా పిలుస్తున్నారని తెలుస్తోంది.ధర్మ మూర్తులైన పాండవుల సంచరించిన ప్రాంతం కనుకనే వడ్డాది పరిసర గ్రామాలు సస్యశ్యామలమై పాడిపంటలతో తులతూగుతున్నాయని భక్తుల విశ్వాసం.

**ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు....**

ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వహణాధికారి టి.ఎన్.ఎస్ శర్మ సంయుక్తంగా తెలిపారు.భక్తులు క్యూలైన్లో వెళ్లేందుకు బారికేడ్లు భారీగా,పోలీసు బందోబస్తు, వైద్య శిబిరము,త్రాగునీరు, ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. కొండ వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోను, జంక్షన్లో స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

For a pure tomorrow.. జయహే

# జీవీఎంసీలో సెల్లార్ ఆక్రమణల తొలగింపు

**సెల్లార్ ఆక్రమించిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి.**

**లేదంటే కూల్చేస్తాం**

**జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్ రావు**





**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ లో పలు జోన్ల పరిధిలో ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో వ్యాపారాలకు వినియోగిస్తున్న 11 ఆక్రమణలను 25, 26వ తేదీలలో తొలగించడం జరిగిందని, సెల్లార్ ఫ్లోర్లను ఆక్రమించిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఏ.ప్రభాకర్ రావు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

నగర పరిధిలో ప్రజలు, వాహనదారులు రోడ్లపై, ఫుట్ పాత్ లపై, బహిరంగ ప్రదేశాలలో వారి వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నందువలన రోడ్లు ఇరుకునకు గురై ట్రాఫిక్ నకు అంతరాయం కలుగుతున్నందున ప్రజలు, వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సౌకర్యార్థం వాణిజ్య సముదాయాలు, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లను పూర్తిగా కేవలం వాహనాలు నిలుపుకొనే సౌకర్యార్థం ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఇప్పటికే ప్రారంభమైన ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా మధురవాడ, నార్త్, ఈస్ట్, వెస్ట్, గాజువాక, అనకాపల్లి జోనులలో 11 సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీస్ వారి సహకారంతో తొలగించడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి తెలిపారు.ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా మధురవాడ 8వ వార్డులో మిధిలాపురి కాలని వద్ద ఒక ఆక్రమణ, నార్త్ జోనులో 14వ వార్డులో సీతమ్మధార వద్ద గోడౌన్, 43వ వార్డులో దొండపర్తి వద్ద ఒక ఆక్రమణ, వెస్ట్ జోనులో 90వ వార్డులో ఎన్.ఎ.డి. జంక్షన్ వద్ద ఒక ఆక్రమణ, ఈస్ట్ జోనులో 15వ వార్డులో ఇసుకతోట వద్ద కృష్ణ మందిర్ ఎదురుగా ఒక ఆక్రమణ, 13వ వార్డులో దారపాలెం వద్ద ఒక ఆక్రమణ, గాజువాక జోనులో 67వ వార్డులో గాజువాక మెయిన్ రోడ్ హెచ్ డీ ఎఫ్ సి బ్యాంకు వద్ద స్టోరేజ్ మెటీరియల్ ను, సౌందర్య వద్ద స్టోరేజ్ మెటీరియల్ ను, అనకాపల్లి జోనులో 82 వ వార్డులో ఎ పీ ఎన్ ఆర్ కాంప్లెక్స్, ఎమ్మార్వో ఆఫీసు రోడ్ వద్ద ఒక షాపును, పూడిమరక రోడ్డు వద్ద రెండు ఆక్రమణలు తొలగించడం జరిగిందని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. నగరంలో ఆపరేషన్ లంగ్స్ 3. 0 లో భాగంగా సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను తొలగించడం జరుగుచున్నందున, ఇప్పటికే పలు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో పార్కింగ్ కోసం కాకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను వెంటనే స్వచందంగా ఆక్రమణదారులు తొలగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా జోనుల సహాయక ప్రణాళిక అధికారులు, ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

**చోడవరం,ఫిబ్రవరి 26, జయ జయహే**

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంకితభావంతో చేపట్టి పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు అన్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు సూచనలతో గురువారం మండలంలోని గోవాడ గ్రామంలో ప్రారంభించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు ఏడువాక నూకరాజు ,బండి గోపి లతో కలిసి ముందుగా చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవితో తొలి సభ్యత్వాన్ని నమోదు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ సభ్యత నమోదు కార్యక్రమాన్ని శక్తి వంచన లేకుండా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ ఏడువాక శ్రీనివాసరావు పాల సంఘం డైరెక్టర్ ధర్మిశెట్టి గాలి నాయుడు స్కూల్ కమిటీ డైరెక్టర్ వేపాడ చిరంజీవి ,వేపాడ అప్పారావు, సేనాపతి అప్పలనాయుడు ఏడువాక శంకర్రావు, బేరా సన్యాసిరావు, తాసుబిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం

**రహమత్ నగర్ మసీదులో**

**ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని రహమత్ నగర్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు.ఈ సందర్భంగా జరిగిన ప్రార్ధనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం, ప్రార్థనలు మనలో ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మత భేదాలు మరచి సమాజంలో ఐక్యత నెలకొల్పడమే ఇఫ్తార్ విందుల లక్ష్యమన్నారు. మనమందరం ఒకే దేవుని సృష్టులమనే సందేశాన్ని రంజాన్ బోధిస్తోందన్నారు.కూటమి ప్రభుత్వం మత సామరస్యాన్ని కాపాడుతూ పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యత నెలకొనాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరపున నిధులు కేటాయించినట్లు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని విషయాల్లో ముస్లింలతో కలిసి ముందుకు సాగుతామని, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.





## ఉర్లోవ రెవిన్యూ పరిధిలో జీడి తోట ఈ- క్రాఫ్ నమోదు చేయాలి

**చోడవరం, ఫిబ్రవరి 26**

ఒమ్మలి గ్రామ సభలో ఉల్లావ రెవిన్యూని ఈ ఏడాది జనవరిలో వెబ్ ల్యాండ్ లో నమోదు చేసి పట్టాలిస్తామని మాడుగుల చోడవరం ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారనీ ఆ హామీ అమలు చేయాలని కోరుతూ గురువారం కోమీరి గ్రామంలో పేకార్డ్ లతో గిరిజనులు నిరసన తెలిపారు.అనకాపల్లి జిల్లా రావికతం మండలం కొమెరి, మచ్చిపురం,బుడ్డి బంద, కవ్వుకుంట గిరిజనులు దళితులు ఇతర పేదలు350 మంది ఊర్లోవ రెవిన్యూ పరిధిలో డి- పట్టా కలిగి ఉన్నారు. ఈ రెవెన్యూ వి.మడుగుల మండలం పరిధిలో ఉంది. 2012-13 సంవత్సరంలో పట్టాలిచ్చారు. రెవిన్యూ వెబ్లాన్ రికార్డులు లోఊరలోవ రెవిన్యూ అనేది లేదు. వెబ్లాండి రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని కోరుతూ భూమి సిస్తులు కమిషనర్ విజయవాడ వారికి సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ ఆదేశం మేరకు జిల్లా కలెక్టర్, ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నెల రోజుల్లో రికార్డు తయారు చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు . దీనికి స్పందించిన తహసిల్దార్ ఇతర అధికారులు గత ఏడాది సెప్టెంబర్ లో వి జగన్నాధపురం లో చోడవరశీ, మాడుగుల ఎమ్మెల్యేలు సత్యనారాయణమూర్తి. కే ఎస్ ఎన్ రాజు స్థానిక ఎమ్మార్వో ప్రజాప్రతినిధులు గ్రామసభ నిర్వహించి జనవరి నెలలో ఊరలోవ రెవిన్యూ వెబ్ ల్యాండ్ రికార్డులో నమోదు చేసి రికార్డులు నమోదు చేసి పట్టాలిస్తామని సభలో ప్రకటించారు. నేటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు

## పంచాయతీ నిధులతో మెట్ల మార్గం నిర్మాణం

**మాడుగుల,ఫిబ్రవరి 26, జయ జయహే**



మాడుగుల సమీపంలో సాగరం వెళ్లే రహదారిలో తాచెరు నదిలోకి వెళ్లేందుకు భక్తులు సౌకర్యం పంచాయతీ నిధులతో మెట్లు మార్గం నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు.గతంలో రైతుల కోరిక మేరకు మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఇచ్చిన హామీతో మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలిమేర విజయలక్ష్మి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, అనకాపల్లి జిల్లా ఐవీఎఫ్ఆర్యవైశ్య సంఘ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు, కో ఆప్షన్ నెంబర్ షేక్ ఉన్నిష,వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ మధ్యకాలంలో తాచేరునది పక్కనే శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో కార్తీకమాసంలో భక్తులు మెట్లు ద్వారా నదిలోకి దిగి స్నానాలు చేసేందుకు ఈ మెట్లు ఉపయోగపడతాయని వారు తెలిపారు. భక్తులకు మెట్లు ఏర్పాటు చేసే విధంగా ఏర్పాటు చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కు పంచాయతీ సర్పంచ్ పాలకవర్గానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్ శీలమంతుల జ్యోతి రైతులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండరు ఘనత లోకేష్ దే...!

**వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**



యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమని వి ఎం ఆర్ డీ ఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. విశాఖ లో గురువారం ఆయన మీడియాతో మాటాడుతూ ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినందుకు నిరుద్యోగ యువత తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్న మన్నారు. డీఎస్సీ ప్రకటించినందుకు నిరుద్యోగుల తరుపున, జాబ్ క్యాలెండర్ ద్వారా పారదర్శక నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత విద్యా శాఖ మంత్రి లోకేష్ దే నని పేర్కొన్నారు. విద్యా రంగ సంస్కరణల్లో ఆయన నాయకత్వం రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తోందని, ఐటీ మరియు నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వం పట్ల యువత ఆసక్తిగా ఉందన్నారు. యువత ఆశయాలను నిజం చేసే నిజమైన నాయకులు మంత్రి లోకేష్ అని, అభివృద్ధి, ఉపాధి, పారదర్శక పాలన, విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ ధర్నా

**చోడవరం ఫిబ్రవరి 26, జయ జయహే**





దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చోడవరం తాలూకా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. చోడవరం, చీడికాడ, బుచ్చయ్యపేట, మాడుగుల, రావికమతం, కె కోటపాడు, దేవరా పల్లి మండలాల ఏపీటీఎఫ్ ప్రతినిధులు సుమారు 150మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు తమరాన త్రినాధ ప్రారంభించి మాట్లాడారు. 12వ పిఆర్సి కమిషన్ను వెంటనే నియమించాలని, అంతవరకూ 30% మధ్యంతర భృతిని చెల్లించాలని, బకాయి ఉన్న నాలుగు కరువు భత్యాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందని ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలలో కలపడం సరికాదని పిఎస్ హెచ్ఎం పోస్టును అర్హత గల ఎస్ జి టి లకు మాత్రమే ఇవ్వాలని అలాగే 2009 ముందు నియమించిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు తమరాన త్రినాధ అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్ దుర్గాప్రసాద్ ఉపాధ్యక్షులు మోసూరి మహాలక్ష్మి నాయుడు జిల్లా కార్యదర్శి ఏ ప్రసాదరావు,రాష్ట్ర కౌన్సిలర్ విజయలక్ష్మి , శ్యాం కుమార్, చోడవరం మండల శాఖ గౌరవ అధ్యక్షులు గొల్లు శ్రీనివాసరావు అధ్యక్షులు ఆర్ చిరంజీవి ,పూర్వ ప్రధాన కార్యదర్శి బి వి కె కిషోర్, బుచ్చయ్యపేట మండల శాఖ అధ్యక్షులు పి శేషు కుమార్, మరియు చీడికాడ ప్రధాన కార్యదర్శి ఎం టివి ఫణి కుమార్, రావికమతం అధ్యక్షులు హరిప్రసాద్, సుధీర్ కుమార్ ,మాడుగుల సన్యాసిరావు, కోటపాడు శ్రీనివాసరావు,లలిత ప్రసాద్, దేవరపల్లి శ్రీనివాసరావు, సింహాచలం నాయుడు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుడు విశ్వరూపుడు..!

## ప్రవచన యజ్ఞంలో సామవేదం షణ్ముఖ శర్మ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే :**



భగవంతుడు విశ్వరూపుడు అని వాగ్దేవీ వరపుత్ర సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఋషి పీఠం, సత్సంగం, విశాఖపట్నం ఆధ్వర్యాన ఎంవీపీ కాలనీ, ఆరో సెక్టార్, ఏబీసీ పార్కులో 14 రోజుల శ్రీమద్భాగవవ ప్రవచన యజ్ఞం ఎనిమిదో రోజైన గురువారం సాయంత్రం ప్రవచనంలో నందుడు, యశోదల ఇంట వ్రేపల్లెలో జరిగిన శ్రీ కృష్ణుడి బాల్య, కౌమార దశల్లోనివివిధ లీలల్ని ఆవిష్కరించారు. కృష్ణ జననం, జననోత్సవాలతో జరిగిన కథను క్లుప్తంగా చెప్పి శ్రీ కృష్ణ తత్వంలో మధుర లీలలు, ఐశ్వర్య లీలలు అని రెండు రకాలుగా వర్గీకరించాలన్నారు. తనను ఆశ్రయించినవారికి ఉత్తమ సద్గతి అనుగ్రహించడమే శ్రీ కృష్ణ అవతారలో గొప్పతనమని ప్రవచనకర్త వర్ణించారు. గోప వనితలా మాయావేషంలో అక్కడికి వచ్చి స్థన్యమిచ్చి బాల కృష్ణుడ్ని అంతం చేయాలనుకున్న పూతన అనే రాక్షసి పాలు తాగుతూ ఆమె రక్తాన్ని పీల్చి నిజస్వరూపంలో మారి గిలిల తనుకుని చనిపోయిన విధాన్ని సామవేదం కళ్లకు కట్టినట్టు వివరించారు. ఆనక తల్లి దిష్టి తీసిన వైనాన్నీ వివరించి భావాతీతుడైన వాడే భగవంతుడు అన్నారు. పరీక్షిత్ మహారాజుకు శుక యోగీంద్రుడు భాగవత కథను చెప్పనట్టు వ్యాసుడి కథనాన్ని అచ్చంగా ఆవిష్కరిస్తూనే భాగవతాన్ని తెలుగులోకి అనువదించిన పోతన పద్యాలన్నీ అవసరానుగునంగా సామవేదం ఉటంకించారు. గర్గ మహర్షి శ్రీ కృష్ణుడికి, బలరాముడికీ ఒకే రోజు నామకరణ చేసిన సంగతి వివరిస్తూ నిఘంటు అర్థంలో కాకుండా వేదార్థంలో కూడా వాటికి అర్థాలు తెలుసుకోవాలన్నారు. క్రిష్ అనే ధాతువుకు ఎప్పుడూ ఉండేది అన అర్థం. న అంటే ఆనందం, చిదానందం అన్నారు. కాలానికి అందరూ లొంగాల్సిందే అని కృష్ణ కథ ద్వారా తెలుసుకోవాలన్నారు. కృష్ణ నామం భక్తిని వృద్ధి చేస్తుంది. అచ్చమైన భక్తికి బేధ దృష్టి ఉండదు హరి ఉంటే సిరి ఉంటుంది అని సామవేదం వివరించారు. ఏక కాలంలో సర్వవ్యాప్తమై ఉండటమే శ్రీ కృష్ణావతారంలో విశిష్ఠతగా ఆయన పేర్కొన్నారు. భగవంతుడు మానవుడి అవతారంలో ఉన్నా 100 శాతం మానవ లక్షణాలు కలిగి వాడే రాముడు అని సందర్భానుసారం చెప్పుకొచ్చారు. బాల కృష్ణుడు ఆవులించినప్పుడు తల్లి యశోదకు విశ్వరూపం కనిపించిన ఘట్టం. యుద్ధభూమిలో అర్జునుడికి మాయ తొలగించి విశ్వరూప దర్శనం అనుగ్రహించిన విషయాలను ఆయన ఉటంకించారు. కౌమారంలో గోపాలక వృత్తి వహించినపుడు జరిగిన రాక్షస సంహారాలు తదితర సన్నివేశాలు ఆసక్తికరంగా ఆవిష్కరించారు. విశేష సంఖ్యలో హాజరైన భక్తులతో ఈ ప్రాంగణం కిటకిటలాడింది.

# అరకులో ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ శిబిరం

**అరకులోయ: జయ జయహే.**



అరకు వేలి మండల కేంద్రంలోని ఎండపల్లివలస లో రైల్వే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ రైల్వే ఉద్యోగులు స్థానిక ప్రజల కోసం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించబడింది. విశాఖ మెడికో క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ (విశాఖపట్నం) నుంచి ఆంకాలజిస్ట్ డా. వెంకట సాంబశివరావు బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.క్యాన్సర్ అవగాహన స్క్రీనింగ్ పరీక్షలు శిబిరంలో క్యాన్సర్ సంబంధిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. పాన్ పరాగ్, గుట్కా, పొగాకు వంటి చెడు అలవాట్ల వల్ల క్యాన్సర్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్లు హెచ్చరించారు. స్క్రీనింగ్ టెస్టులతో పాటు క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరణాత్మక సమాచారం అందించారు.క్యాన్సర్ గురించి ముఖ్య విషయాలు దేశంలో సుమారు 30% క్యాన్సర్ కేసులు చెడు అలవాట్ల వల్ల వస్తున్నాయి.ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ పూర్తిగా నయం చేసే అవకాశం ఉంది.మహిళల్లో గర్భాశయ (సర్వికల్) రొమ్ము క్యాన్సర్లు అధికంగా ఉన్నాయి.పురుషుల్లో నోటి, లివర్ క్యాన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.9ఉ45 ఏళ్ల మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.చికిత్స సహాయం అవసరమైతే రోగులను విశాఖపట్నం ఆసుపత్రికి రిఫర్ చేసి తదుపరి పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందిస్తామని డాక్టర్లు హామీ ఇచ్చారు. నిర్ధారణ, చికిత్స తరువాతి అబ్జర్వేషన్ కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.నాలుగో దశ క్యాన్సర్ కేసుల్లో కూడా 30% వరకు నయం అయ్యే అవకాశం ఉంది. చెడు అలవాట్లు మానుకుంటే క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.క్యాన్సర్ రాకుండా చేసే ప్రత్యేక మందు ఇప్పటివరకు లేదు, అయితే పూర్తి నయం కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయి.ఈ శిబిరం ద్వారా స్థానికులు, రైల్వే ఉద్యోగులు ఆరోగ్య అవగాహన పెంచుకునే అవకాశం పొందారు. ముందస్తు స్క్రీనింగ్ ద్వారా జీవితాలను కాపాడుకోవచ్చని డాక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి







### సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి

### మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి: జెవి రత్నం

**విశాఖపట్నం (జయ జయహే)**

చెత్త రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. గురువారం ఉదయం మధురవాడ దగ్గర మిధిలాపురిలోని గ్లోబ్ విద్యా సంస్థలో ప్రిన్సిపాల్ లలిత అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో స్వచ్చాంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మన విశాఖ నగరంలో ఎక్కడా చెత్త పారవేయరాదని, జి విఎంసి వాహనాలకు చెత్త ఇవ్వాలని కోరారు. మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. ఏ జీవి అంతరించినా మానవాళి మనుగడే ప్రమాదం లో పడుతుంది అన్నారు. విద్యార్థులు అందరూ పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత కోసం గ్రీన్ సోల్జర్స్ గా తయారు అవ్వాలి అని పిలుపునిచ్చారు. విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కృషి చేయాలని కోరారు. మన అందమైన నగరాన్ని ఒక సుందరమైన వనంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, గ్రీన్ వాలంటీర్ ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు



## ఘనంగా రామాలయం వార్షికోత్సవ వేడుకలు

**చోడవరం ఫిబ్రవరి 26 జయ జయహే**

చోడవరం మండలం శ్రీరామ్ పట్నం గ్రామంలో గురువారం రామాలయ పదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనేకమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.దీనిలో భాగంగా జెర్రిపోతుల శంకరరావు, కళ్లేపల్లి గున్నయ్యశెట్టి కుటుంబ సభ్యులు చే అభిషేకాలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## మాడుగుల పశు వైద్యశాలలో సమీక్షా సమావేశం

**మాడుగుల ఫిబ్రవరి 26, జయ జయహే**

మాడుగుల ఏరియా పశు వైద్యశాలలో గురువారం పశు వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సహాయ సంచాలకులు డా. చిట్టి నాయుడు హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న 150 రూపాయలకే లింగ నిర్ధారిత వీర్యం ( ఆడ పెయ్యలు పుట్టే ఇంజెక్షన్ ) గురించి మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న పాడి రైతులకు అవగాహన కల్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలాగా చూడాలని సూచించారు.అలాగే ఈ నెల 27 నుండి మార్చి 13 వరకు గొర్రెలు, మేకలకు పి.పి.ఆర్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించాలని, మార్చి నెలాఖరుకు ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. దానికనుగుణంగా తమ ప్రణాళిక ప్రకారం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి. మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డా. వి. చిట్టి నాయుడు, కింతలి వల్లాపురం, పెదగోగాడ, చీడికాడ పశు వైద్యాధికారులు డా. రాఘవమ్మ, డా. మణి లక్ష్మణ్, డా. శివ కుమార్, పారా సిబ్బంది మేరీ రత్నం, ప్రసాద్, సంతోష్, సంతోష్ కుమార్, నానిబాబు, పశు సంవర్ధక సహాయకులు గోపాలమిత్రలు పాల్గొన్నారు.



## 28 నాటికి కుటుంబ సర్వే పూర్తి చేయాలి

### తూర్పు జోన్‌లో పర్యటించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, జయ జయహే**

యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం తూర్పు జోన్‌లో పర్యటించి పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామాలయం, గాంధీనగర్ జంక్షన్, సంజయ్ గాంధీ కాలనీఉ1 సచివాలయాల్లో జరుగుతున్న యు.ఎఫ్.ఎస్. కుటుంబ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీల సందర్భంగా పలు అంశాలపై అధికారులకు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. కుటుంబ సర్వేను ఫిబ్రవరి 28 నాటికి తప్పనిసరిగా 100 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు సర్వే ప్రారంభించని సచివాలయ సిబ్బందిపై ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. తూర్పు జోన్ పరిధిలోని కొన్ని పరిమిత ప్రాంతాల్లో ప్రజలు సర్వేకు సహకరించకపోవడంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల సహకారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజలు సచివాలయ సిబ్బందికి పూర్తిగా సహకరించి యునిఫైడ్ ఫ్యామిలీ కుటుంబ సర్వేను శాతం పూర్తయ్యేలా తోడ్పాటు అందించాలని, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే 48వ వార్డులో ఓట్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన సంబంధిత విభాగాల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, ఎన్నికల విభాగం అధికారులు పర్యటనలో పాల్గొన్నారు.



## టేస్టీ టేస్టీ దొండకాయ ఉల్లికారం

**రోటీ, రైస్‌కి పర్‌ఫెక్ట్ కాంబినేషన్ రెసిపీ**

దొండకాయలను ఫ్రై, కర్రీల రూపంలో చేసుకుంటారు. కొందరు దీనిని తినేందుకు ఇష్టపడరు. అయితే లంచ్ సమయంలో దొండకాయను టేస్టీగా తినాలనుకుంటే దొండకాయ ఉల్లికారం చేసుకోవాలి. ఇది మంచి రుచిని అందించడమే కాకుండా లంచ్‌కి పర్ ఫెక్ట్ కాంబినేషన్ అవుతుంది. దీనిని నేరుగా రోటీలు, రైస్‌లలో కలిపి తినవచ్చు. లేదంటే పప్పు చారు, సాంబార్ చేసుకున్నప్పుడు సైడ్ డిష్‌గా చేసుకోవచ్చు. మరి ఈ టేస్టీ రెసిపీని ఎలా చేయాలి? కావాల్సిన పదార్థాలు ఏమిటి వంటి విషయాలు ఇప్పుడు చూసేద్దాం.

**కావాల్సిన పదార్థాలు**

దొండకాయలు – పావు కేజీ
నూనె – 4 టేబుల్ స్పూన్స్
జీలకర్ర – 1 టీస్పూన్
ధనియాలు – 1 టీస్పూన్
ఎండుమిర్చి – 10
ఉల్లిపాయ – 1 పెద్దది
పసుపు – అర టీస్పూన్
ఉప్పు – రుచికి తగినంత
వెల్లుల్లి – 5 రెబ్బలు
కరివేపాకు – 1 రెబ్బ
చింతపండు రసం – 2 స్పూన్స్

**తయారీ విధానం**

ముందుగా దొండకాయలను బాగా కడిగి ముచుకులు తీసి.. నచ్చిన షేప్ లో కట్ చేసుకోవాలి. గుత్తివంకాయ మాదిరిగా కూడా వీటిని కట్ చేసుకుని ఈ రెసిపీని చేసుకోవచ్చు. అనంతరం ఉల్లిపాయను పెద్ద ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి కడాయి పెట్టండి. దానిలో ఓ స్పూన్ నూనె వేసి.. దానిలో జీలకర్ర, ధనియాలు వేసి వేయించాలి. అవి కాస్త వేగిన తర్వాత దానిలో ఎండుమిర్చి వేయాలి. అనంతరం ఉల్లిపాయలు వేసి వాటిని కాసేపు మగ్గనివ్వాలి.

ఉల్లిపాయలు పూర్తిగా ఉడకాల్సిన అవసరం లేదు. కాస్త మగ్గితే సరిపోతుంది. ఇలా వేయించుకున్న మిశ్రమాన్ని కాసేపు చల్లారనివ్వాలి. ఈలోపు స్టౌవ్ వెలిగించి మందపాటి కడాయి పెట్టి దానిలో రెండు లేదా మూడు టేబుల్ స్పూన్లు నూనె వేయాలి. దానిలోనే కట్ చేసి పెట్టుకున్న దొండకాయ ముక్కలు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి. కాసేపటి తర్వాత దానిలో కాస్త ఉప్పు, పసుపు వేసి కలపి.. ముక్కలని ఉడకనివ్వాలి. మిక్సీజార్‌లోకి ఉల్లిపాయల మిశ్రమాన్ని తీసుకోవాలి. దానిలో కాస్త ఉప్పు, వెల్లుల్లి రెబ్బలు వేసి పేస్ట్ చేసుకోవాలి. మెత్తగా కాకుండా కచ్చాపచ్చాగా చేసుకోవాలి. దొండకాయలు ఉడికినవో లేదో చెక్ చేసుకోవాలి. లేత దొండకాయలు త్వరగా ఉడుకుతాయి. మంచి రుచిని ఇస్తాయి కాబట్టి.. అలాంటివి ఎంచుకుంటే మంచిది. దొండకాయలు ఉడికిన తర్వాత దానిలో మిక్సీ చేసి పెట్టుకున్న ఉల్లికారం వేయాలి. దొండకాయలకు ఉల్లికారం పట్టేలా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు ఉడకనివ్వాలి. ఇప్పుడు దానిలో చింతపండు రసాన్ని వేసి ఉడకనివ్వాలి. దానిలో కరివేపాకు కూడా వేసి కలపాలి. ఇది పూర్తిగా ఆప్షనల్. వేసుకోకపోయినా పర్లేదు. కానీ వేసుకుంటే టేస్ట్ మంచిగా ఉంటుంది. ఓ 5 నిమిషాలు ఉడికితే దానిలోని నూనె కాస్త పైకి తేలుతుంది. ఇలా నూనె పైకి వచ్చేస్తే దొండకాయ ఉల్లికారం రెడీ అయిపోయినట్టే. దీనిని మీరు రోటీలు, రైస్‌లకు కాంబినేషన్‌గా తీసుకోవచ్చు. దొండకాయను ఇష్టపడనివారికి కూడా ఇది బాగా నచ్చుతుంది. మీరు కూడా ఈ టేస్టీ రెసిపీని లంచ్ రెసిపీగా వాడుకోవచ్చు.

# షుగర్ కంట్రోల్ కాఫీ

**పని ఒత్తిడిని తగ్గించుకునేందు.. మైండ్ రిఫ్రెష్ చేసుకునేందుకు చాలామంది కాఫీ తాగుతుంటారు. మీరు కూడా అలాంటివారిలో ఒకరా? అయితే ఈ విషయాలు మీరు తెలుసుకోవాలి.**



కాఫీని ఎక్కువ తాగడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదని.. పూర్తిగా మానేస్తే ఆరోగ్యానికి మంచిదని అంటుంటారు వైద్యులు. డాక్టర్ చెప్పారని దానిని కంట్రోల్ అయితే చేస్తారు కానీ.. అస్సలు తాగకుండా ఉండమంటే మాత్రం కష్టమనే అంటారు. అయితే కాఫీ పూర్తిగా మానేయకుండా ఈ ఒక్క మార్పు చేసి.. లిమిటెడ్‌గా తీసుకుంటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు అంటున్నారు పరిశోధకులు. పలు అధ్యయనాలు దానికి ఊతమిస్తున్నాయి. ఇంతకీ ఆ మార్పు ఏమిటి?

కాఫీలో ఎవరైనా షుగర్ వేస్తాను అంటే నో అని చెప్పండి. అమ్మో కాఫీలో పంచదార లేకుంటే ఎలా అనుకోవద్దు. ఎందుకంటే.. కాఫీలో షుగర్ వేసుకోకుండా లిమిటెడ్‌గా తీసుకుంటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. మధుమేహం, గుండె జబ్బులు, నిద్ర, స్కిన్ వంటి సమస్యలను ఇది కంట్రోల్ చేస్తుందని చెప్తున్నారు నిపుణులు. పాలు కూడా లేకుండా సాదా బ్లాక్ కాఫీని లిమిటెడ్‌గా తీసుకుంటే దీర్ఘకాలిక సమస్యలు దూరమవుతాయంటున్నారు పరిశోధకులు.

**మధుమేహాన్ని తగ్గిస్తుంది..**


కాఫీలో పంచదార కలిపి తీసుకోవడం వల్ల మహిళల్లో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 8 శాతం ఎక్కువ ఉందని హార్వర్డ్ యూనివర్సిటీ తెలిపింది. కాఫీలో షుగర్, స్వీట్‌నెర్స్ కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కానీ పంచదార లేకుండా సాధా కాఫీ తాగితే.. ఈ ప్రమాదాన్ని 8 శాతం తగ్గించవచ్చు అంటున్నారు. అయితే కొన్ని అధ్యయనాలు కెఫీన్ కూడా ఇన్సులిన్ సెన్సిటివిటీని దెబ్బతీస్తుందని చెప్తున్నాయి. కాబట్టి చక్కెర లేకుండా కాఫీ తాగినా.. దానిని లిమిటెడ్‌గా తీసుకోవాలి.

**హార్ట్‌కి మంచిది..**

ప్రతి ఏటా గుండె సమస్యలతో ఎందరో చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. కార్డియోవాస్కులర్ ప్రజలపై తీవ్ర పరిణామాలు చూపిస్తుంది. అయితే కెఫీన్ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. కాఫీ గుండె ఆరోగ్యానికి మంచిదే కానీ.. షుగర్ లేకుండా తీసుకుంటే దీని ప్రభావం బాగుంటుంది.

**మైండ్ యాక్టివ్‌గా ఉంటుంది..**

మీరు కొన్ని విషయాలు తరచుగా మరచిపోతున్నారా? జ్ఞాపకశక్తికి ఉండట్లేదా? అయితే మీరు ఓ కప్పు కాఫీని తాగవచ్చు. ఇది మైండ్‌ని యాక్టివ్‌గా ఉంచి.. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. ఈ విషయాన్ని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. చక్కెర దీనికి వ్యతిరేకంగా పని చేస్తుంది కాబట్టి దానిని తీసుకోకపోవడమే మంచిది.



**బరువు తగ్గేందుకు..**


బరువు తగ్గాలని చూస్తున్నారా? అయితే మీరు మీ డైట్ లో కాఫీ చేర్చుకోవచ్చు. ఓ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం కెఫిన్ బరువు తగ్గించడంలో సహాయం చేస్తుందని గుర్తించారు. ఇది శక్తితో పాటు.. మెటబాలీజంను పెంచి.. బరువును వేగంగా తగ్గించడంలో సహాయం చేస్తుంది. దీనివల్ల ఎక్కువ కేలరీలు కరుగుతాయి. కాలేయంలోని కొవ్వును కూడా తగ్గించి.. ఊబకాయం సమస్యలు రాకుండా చేస్తాయి.

**రక్తపోటు కంట్రోల్ అవుతుంది..**

అధికరక్తపోటు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి దానిని కంట్రోల్‌లో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఓ అధ్యయన కాఫీ తాగడం వల్ల రక్తపోటు తగ్గుతుందని తెలిపింది. దీనిని మితంగా, షుగర్ లేకుండా తీసుకోవాలి. పంచదార కలిపి తీసుకుంటే సమస్యలు ఎక్కువ అవుతాయి.

ఇవే కాకుండా పళ్ల సమస్యలు రాకుండా ఇది కంట్రోల్ చేస్తుంది. అందుకే చక్కెర లేకుండా కాఫీని మితంగా తీసుకోవాలంటున్నారు. ఇది ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే కొన్ని సమస్యలున్నవారు దీనికి దూరంగా ఉండాలంటున్నారు. జీర్ణ సమస్యలు, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ సమస్యలను ఇది దూరం చేస్తుంది. ఒకవేళ మీకు కాఫీ అలెర్జీ ఉంటే దాని జోలికి అస్సలు వెళ్లకపోవమే మంచిది.

# వాకింగ్‌తో ఎన్నో లాభాలు



మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా ఫిట్ గా ఉండాలి. అలా ఫిట్ గా ఉండాలంటే.. ఎక్సర్ సైజ్ కచ్చితం. కానీ, చాలామంది హై ఇంటెన్స్ వర్కౌట్స్ చేయలేరు. అలాంటి వాళ్లు వాకింగ్ చేస్తే మంచిదని చెప్తున్నారు హెల్త్ ఎక్స్ పర్ట్స్. వాకింగ్ చేయడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని, వాకింగ్ చేయడం చాలా ఈజీ కూడా అని సూచిస్తున్నారు. బయటికి వెళ్లి వాకింగ్ చేయడం కుదరని వాళ్లు ట్రెడ్ మిల్ పై వాకింగ్ చేసినా మంచి లాభాలే ఉంటాయని, హెల్దీగా ఉంటామని అంటున్నారు. మరి వాకింగ్ చేస్తే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? ఒకసారి చూద్దాం.

**కేలరీలు కరిగిపోతాయి..**

ప్రతి రోజు వాకింగ్ చేయడం వల్ల కేలరీలు ఎక్కువగా కరుగుతాయని అంటున్నారు ఎక్స్ పర్ట్స్. జాగింగ్ చేయడం కంటే వాకింగ్ చేస్తేనే ఎక్కువ కేలరీలు కరుగుతాయని చాలా రిసెర్చ్ ల్లో తేలింది. మీరు ప్రతిరోజు చేసే ఎక్సర్ సైజ్ లకి, వర్కౌట్స్ కి వాకింగ్ జత చేస్తే కేలరీలు ఎక్కుగా కరుగుతాయి అని ఇంటర్నేషనల్ పర్సనల్ ట్రైనర్ అకాడమీ వెల్లడించింది.

**కొవ్వు కరిగిపోతుంది..**

వాకింగ్ చేయడం వల్ల కేలరీలు కరగడమే కాకుండా.. ఒంట్లోని కొవ్వు కూడా కరిగిపోతుంది. అయితే, అది మనం తినే తిండిని బట్టి కూడా ఉంటుందని అని చెప్తున్నారు నిపుణులు.

**కండరాలు దృఢంగా అవుతాయి..**

వాకింగ్ చేసినప్పుడు వివిధ కండరాలు పనిచేస్తాయి. దానివల్ల అవి గట్టిపడి దృఢంగా తయారు అవుతాయి. ముఖ్యంగా కాళ్లలోని కండరాలు, ఎముకలు స్ట్రాంగ్ అవుతాయి.

**బీపీ తగ్గిస్తుంది...**

ప్రస్తుతం చాలామందిలో బీపీ సమస్య ఉంది. అయితే, రోజు వాకింగ్ చేస్తే ఆ సమస్య తగ్గుందని అంటున్నారు. బీపీ కంట్రోల్ లో ఉండటం వల్ల హార్ట్ బాగా పనిచేస్తుందని, ప్రతి రోజు చేసే ఎక్సర్ సైజ్ లకి వాకింగ్ యాడ్ చేస్తే బ్లడ్ ప్రజర్ కంట్రోల్ ఉంటుందని రిసెర్చ్ లో తేలినట్లు నిపుణులు చెప్పారు.

**ఎముక సాంద్రత పెరుగుతుంది..**

ఎముక సాంద్రత పెరగాల్సిన వాళ్లు వాకింగ్ చేస్తే మంచిది. అమెరికన్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ ప్రకారం.. పోస్ట్ మెనోపాస్ లో ఉన్న మహిళలు రోజు వాకింగ్ చేస్తే వాళ్ల ఎముక సాంద్రత బాగా పెరుగుతుంది. వాకింగ్ చేస్తే రేట్ ఆఫ్ బోన్ లాస్ తగ్గుతుందని, అస్థిపంజర సమగ్రత కూడా పెరుగుతుంది.

వర్క్ డే లో, అదే పనిగా కూర్చుని పని చేసేవాళ్లు కచ్చితంగా వాకింగ్ ని మెరుగుపరుచుకోవాలి. దాని వల్ల పోస్టురల్ కండరాల్లు బలపడతాయి. నిలబడినప్పుడు, నడిచినప్పుడు పోశ్చర్ కండరాళ్ల సపోర్ట్ కావాలి. కాబట్టి అవి స్ట్రాంగ్ అవ్వాలంటే కచ్చితంగా వాకింగ్ చేయాల్సిందే.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com